# కూటమి పాలన.. ప్రజల పాలిట శాపం

- సచివాలయ సేవలకు 'చంద్ర' గ్రహణం
- వైఎస్సార్‌సీపీ అమలు చేసిన పథకాలకు చరమగీతం
- గ్రామాల్లో అభివృద్ధికి చిరునామాగా ఉన్న సచివాలయాలపై చిన్న చూపు
- వెన్నుపోటు పొడిచారంటూ ప్రజల గగ్గోలు



నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో పాడైన సచివాలయ గుమ్మాలు



గుండుగొలనులో పిచ్చిమొక్కలతో నిండిన వెల్‌నెస్ కేంద్రం

భీమడోలు: కూటమి సర్కార్ పాలన ప్రజల పాలిట శాపంగా మారింది. సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ సుపరిపాలనలో ప్రజలకు అందించిన సేవలను ఒకొక్కటిగా దూరం చేసి పేదల గుండెల్లోంచి వాటిని తుడిచి వేయాలని ప్రయత్నం చేస్తుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. కాని ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు తిలోదకాలిస్తూ పేద ప్రజలకు వాటిని అందకుండా చరమగీతం పాడుతుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలోనే అందాయి. కూటమి హామీలు నీటిమూటలుగా మిగిలిపోయాయి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పాలన చేస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. దీంతో పాటు గ్రామాల్లో ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను అందించాలన్న సంకల్పంతో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు ఈ ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయి.

**గత ప్రభుత్వంలో 90 శాతం భవనాలు పూర్తి**

90 శాతం పూర్తయిన భవనాలకు 10 శాతం నిధులిస్తే నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రజలకు మెరుగైన సేవలందించే వాటిని కూడా పట్టించుకోకపోవడంతో చుట్టూ చిట్టడవిలా చెట్లు పెరిగిపోయి నిరుపయోగకరంగా మారాయి. దీంతో ఈ నెల 4వ తేదీన వెన్నుపోటు దినం నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ పిలుపు నిచ్చింది. ఓ పక్క పథకాలు అందక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, కూలి పనులు కూడా లేక ఏమి చేయాలో పాలుపోక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబు మోసానికి మరోసారి బలయ్యామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలనపై ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గుండుగొలను సచివాలయం-2 భవనాన్ని నిర్మించేందుకు రూ.43.60 లక్షలు మంజూరు చేసింది. వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో అప్పట్లో ఆ భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికను చేపట్టారు. 90 శాతం సచివాలయం-2 పూర్తయింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ భవనాలను పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో ఫర్నిచర్ చెదలు పట్టింది. వాటి చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచి దుర్వాసన కొడుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. దీనికి ఆనుకొని ఉన్న వెల్‌నెస్ కేంద్రం పిచ్చిమొక్కలతో కనిపించకుండా పోయింది. ఆ పక్కనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చారు. ఆ జగనన్న కాలనీలో 900 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ పక్కనే నిర్మించిన సచివాలయం, వెల్‌నెస్ భవనాలు పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరగలేదు. దీంతో వారంతా సుమారు 2 వేల మంది మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీకి పనుల నిమిత్తం రావాల్సి వస్తుంది. పోలసానిపల్లి పంచాయతీలో జగనన్న కాలనీలోని రైతు భరోసా కేంద్రాన్ని పంచాయతీ కార్యాలయంగా మార్చడంతో వివాదం ఏర్పడింది. వెల్‌నెస్ కేంద్రం నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడంతో నిరుపయోగకరంగా ఉంది. ఓ పాఠశాల ప్రాంగణంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ఆరోగ్య కేంద్రంగా మార్చు చేశారు.

**అభివృద్ధి చిరునామా జగనన్న పాలన**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో 17 సచివాలయాల్లో 10 పూర్తయ్యాయి. ఆర్‌బీకేల్లో 17కు గాను 12 పూర్తయ్యాయి. వెల్‌నెస్ కేంద్రాలు 17లో 4 కంప్లీట్ అయ్యాయి. దీంతో గ్రామాల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి జరిగింది. తక్కువ నిధులు ఇస్తే పూర్తి అయ్యే భవనాలను సైతం ఈ ప్రభుత్వం పక్కన పడేసింది.

### పేదలకు పథకాలు దూరం



చంద్రబాబు అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తానంటూ ప్రజలను నమ్మించి గద్దె నెక్కారు. అధికారంలోకి రాగానే డబ్బులేవని సంపద సృష్టికి సలహాలు అడుగుతున్నారు. సచివాలయాలు, వెల్‌నెస్, ఆర్‌బీకేలకు ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రతి పథకానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడుస్తుంది. కూటమి ప్రభుత్వం పథకాలను ఒక్కొక్కటిగా ఎత్తివేస్తుంది. ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వానికి చరమగీతం పాడడం ఖాయం.

–గంటా శ్రీనివాసరావు, ఎంపీటీసీ చాంబర్ అధ్యక్షుడు, భీమడోలు

## క్లుప్తంగా

### రేషన్ కోసం తప్పని తిప్పలు



చల్లచింతలపూడి రేషన్‌షాపులో క్యూ కట్టిన మహిళలు

దెందులూరు: రేషన్ కోసం రెండో రోజు షాపుల వద్ద మహిళలు క్యూ కట్టారు. మండలంలో 17 పంచాయతీలు 41 రేషన్ షాపులు ఉన్నాయి. ఏడు రేషన్ షాపులకు డీలర్లు లేరు. ఈపోస్ మిషన్లకు సర్వర్ పని చేయకపోవడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ వాహనంలో రేషన్ తీసుకువచ్చి ఇచ్చేవారని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ విధానం రద్దు చేయడం వల్ల మళ్లా షాపులకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుందని వృద్ధులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నగేష్ రేషన్ షాపులను సోమవారం తనిఖీ చేశారు.

### నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం లయన్స్ కల్యాణ మండపంలో నేడు మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అధ్యక్షుడు కోనే వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా రాజాని సతీష్, కోశాధికారిగా గంజ రవి ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు.

### ప్రతిభతోనే పురస్కారాలు

దెందులూరు: విద్య, సేవా రంగాల్లో దివంగత హెచ్‌ఎం గొరుపర్తి హరికృష్ణ స్ఫూర్తి కొనసాగాలని దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, మానవతా చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ అన్నారు. సోమవారం కొవ్వలి భక్తాంజనేయ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన హెచ్‌ఎం సంస్మరణ సభలో అమ్మ సోషల్ డాట్ ఫౌండేషన్ చైర్మన్ కట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేశారు.

### విధుల్లో చేరిన ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: మండల విద్యాశాఖ అధికారి సోమవారం ఎంఈఓ కార్యాలయంలో విధుల్లో చేరారు. గత నెల రోజులుగా ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఇన్‌చార్జి ఎంఈఓగా ఉన్న ఎస్ ఎన్ మూర్తి రిలీవ్ అయ్యారు.

### డ్రెయిన్లలో కలుపు నివారణ మందు పిచికారీ



డ్రెయిన్లలో కలుపు నివారణ మందును పిచికారీ చేయిస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

దెందులూరు: దెందులూరు, సత్యనారాయణపురం గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న గుండేరు డ్రెయిన్‌లో సోమవారం కలుపు మందు పిచికారీ చేశారు. ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం నీటి సంఘం అధ్యక్షుడు పర్వతనేని రంగారావు, వెలమాటి రాంబాబు పర్యవేక్షణలో గుండేరు డ్రెయిన్‌లో కలుపు నివారణ మందు పిచికారీ చేశారు.

### భీమడోలు హెచ్‌ఎంగా గుండేపూడి శేష పద్మజ



జి.శేష పద్మజ

భీమడోలు: భీమడోలు హైస్కూలు హెచ్‌ఎంగా గుండేపూడి శేష పద్మజ విధుల్లో చేరారు. ప్రధానోపాధ్యాయుల సాధారణ బదిలీల్లో ఏలూరు మండలం పోణంగి నుంచి ఆమె భీమడోలు ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు ఏలూరు మండలం గుడివాకలంక ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అదే విధంగా ఆగడాల లంక హెచ్‌ఎం సత్యనారాయణ బదిలీల్లో భాగంగా పెదపాడు మండలం పాతముప్పర్రు పాఠశాలకు వెళ్లారు. ఉంగుటూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉన్న తోట మీనాకుమారి బదిలీపై ఆగడాల లంక వచ్చారు. వీరంతా బాధ్యతలు స్వీకరించారని ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా పోలసానిపల్లి-3 జి.బాలభాస్కర్, భీమడోలు-1 బాలిన సత్యనారాయణ, భీమడోలు-3 రెడ్డియ్య, భీమడోలు-4 బుల్లిదొర, సూరప్పగూడెం దుర్గాప్రసాద్, ఆగడాల లంక పోతురాజు ప్రాథమిక పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు బదిలీపై వెళ్లారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయ 31వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నిత్య కైంకర్యాలతో పాటు విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తాళ్ల రామారావు, సత్యవతి దంపతులు, పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ శాఖ సోలార్ రిజిస్ట్రేషన్లు

భీమడోలు: పీఎం సూర్యఘర్ పథకం కింద భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో ఈ నెల 3వ తేదీన వినియోగదారులకు ఏలూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు సోలార్ రిజిస్ట్రేషన్లు చేస్తారని ఆ శాఖ ఈఈ కేఎం అంబేద్కర్ అన్నారు. భీమడోలులో ఆయన సోమవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ పథకంలో చేరే వినియోగదారులు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. ప్రభుత్వం నుంచి ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేల, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కరెంట్ బిల్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, వినియోగదారుడి సంతకం తీసుకుంటారన్నారు.ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సోలార్ రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు.

### 5న మొక్కలు నాటాలి



దెందులూరు తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. ఈ సదర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ క్లాత్ బ్యాగులను ప్రతి ఒక్కరూ వాడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా అందరూ ఆచరించాలని సూచించారు. మొక్కలను నాటడం ఎంత ముఖ్యమో వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. స్వచ్ఛంద సంస్థలు మేధావులు, ఉద్యోగులు యువత మహిళలు స్వచ్ఛందంగా సంపూర్ణ ఆరోగ్య సమాజ ఆవిర్భావానికి సహాయ సహకారాలు అందించాలని తహసీల్దార్ కోరారు.

# వెన్నుపోటు చంద్రబాబు నైజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ నాయకులు

గణపవరం: నమ్మిన వారిని మోసగించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు విమర్శించారు. సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమ కేసులతో వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అర్థవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, గంటా శ్రీలక్ష్మి, కనుమాల రామయ్య, దేవారపు సోమలక్ష్మి, కోడే కాశీ, కె.జయలక్ష్మి, తుమ్మగుంట రంగాభవాని, దండు రాము, సంకు సత్యకుమార్, మరడ మంగారావు, రావిపాటి శ్రీనివాస్, చీకటిమిల్లి మంగరాజు, మాదేటి సురేష్, నడింపల్లి సోమరాజు, ముళ్లగిరి జాన్సన్, మద్దులరాజా, కొరిపల్లి జయలక్ష్మి, పుప్పాల గోపీ, ఎలిశెట్టి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

**వెన్నుపోటు దినం పోస్టర్ల విడుదల**

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో వెన్నుపోటు దినం పార్టీ నిరసన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఇందుకు నిరసనగా ఈ నెల 4న ఏలూరులో చేసే వైఎస్సార్‌సీపీ నాయకులు చేసే నిరసన కార్యక్రమంలో అన్ని విభాగాల నాయకులు, పాల్గొనాలని కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, పెదవేగి మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట ప్రసాద్‌బాబు, దెందులూరు మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సర్పంచ్ కె.ప్రభుదేవా, మేడికొండ కృష్ణారావు, బలుసు మున్ని, చల్లగోళ్ల తేజ కోరారు.

# యోగాతో రుగ్మతలు దూరం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

భీమడోలు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమడోలు పంచాయతీ వద్ద నిర్వహించిన మండల స్థాయి యోగాసనాల ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభను చాటారు. యోగా ట్రైనర్ సత్యేంద్ర చిన్నారులచే యోగాసనాలు వేయించారు. ప్రతి ఆసనం వలన కలిగే ఆరోగ్యం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. శారీరకంగా, మానసికంగా కలిగే బహుళ ఉపయోగాలను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు వివరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ యోగ మన నిత్య జీవితంలో భాగం కావాలని, ఈనెల 21వ తేదీన వైజాగ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జాతీయ యోగా దినోత్సవం విశిష్టతను వివరించారు. తొలుత లైబ్రరీలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నీతి కథలు, సామూహిక పుస్తక పఠనం, సమీక్షలు రాశారు. కార్యక్రమాల్లో కార్యదర్శి కేవీ తనూజ, పైడిమాల యుగంధర్, ఈతకోట సత్యకృష్ణ సచివాలయ కార్యదర్శులు హేమసుందర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# కూచిపూడి ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ



ప్రదర్శన ఇచ్చిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందచేస్తున్న నిర్వాహకులు

గణపవరం: విజయవాడలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో గణపవరం చిన్నారులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. గణపవరానికి చెందిన కేశవ కూచిపూడి నాట్య అకాడమి గురువు ఝాన్సీ నాగమల్లిక నేతృత్వంలో 8 మంది చిన్నారులు ఈ నాట్య ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. గ్లోబల్ తెలుగు అకాడమి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శనలో 116 బృందాలకు చెందిన 1008 మంది కళాకారులు పాల్గొనగా వారిలో గణపవరం శ్రీశివ కూచిపూడి నాట్య అకాడమీకి చెందిన ప్రజ్ఞ, మనోజ్ఞ, వైష్ణవి, శ్రీనవ్య, అఖిల, అక్షయ, నవనీతరమణి, జాహ్నవి పాల్గొన్నట్లు వీరందరికీ నృత్య కృష్ణవేణి అవార్డులు లభించినట్లు నాట్య అకాడమీ గురువు ఝాన్సీ నాగమల్లిక తెలిపారు. వీరిని గణపవరానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

### మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

చింతలపూడి: జిల్లాను మలేరియా రహితంగా మార్చాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా లార్వీసైడ్ మందులు స్ప్రే చేయాలన్నారు. డ్రై డేలను పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్.మాలిని, చింతలపూడి సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎన్‌వీ ప్రసాద్, రాఘవాపురం, ఎర్రగుంటపల్లి వైద్యాధికారులు కె.నరేష్, చైతన్య, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు రవి, ప్రమీల కుమారి, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### హాస్టళ్లలో నూరు శాతం అడ్మిషన్లకు కృషి చేయాలి

చింతలపూడి: 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు మండలాల పరిధిలో గల హాస్టల్స్‌లో నూరు శాతం విద్యార్థినీ, విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునే విధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ఎం ముక్కంటి ఆదేశించారు. సోమవారం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం వెల్ఫేర్ అసిస్టెంట్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం హాస్టళ్లలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎ.మంగారత్నం, నాలుగు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నాడు బాగు.. నేడు చతికిలబడి



నాడు-నేడులో సుందరంగా తీర్చిదిద్దిన కొవ్వలి ఉన్నత పాఠశాల



పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు

- వైఎస్సార్‌సీపీ హయాంలో సుందరంగా సరస్వతీ నిలయాలు
- కార్పొరేట్ బడిని తలదన్నేలా నడుపాయాలు
- కూటమి హయాంలో ప్రభుత్వ విద్యపై నిర్లక్ష్యం

దెందులూరు: వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వ పాఠశాలలు సర్వాంగ సుందరంగా మారిపోయాయి. నాడు-నేడు పథకం తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కించారు. శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్దారు. పాఠశాల గదులకు రిపేర్లు, ఆకర్షణీయంగా రంగులు, గోడలపై రకరకాల బొమ్మలు, విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, పాఠశాలలకు రక్షణ గోడ, సిబ్బంది కోసం ప్రత్యేక ఫర్నీచర్, అధునాతనంగా మరుగుదొడ్లు తరగతి గదుల్లో ఫ్యాన్లు, సాంకేతిక బోధన కోసం ఎల్‌ఈడీ టీవీలు ఇలా నేడు-నాడు పథకంలో భాగంగా ఎన్నో పనులు చేపట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వ బడిని చూస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తొచ్చేలా చేశారు. కాని ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యాలయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరం గడిచినా పాఠశాలల మౌలిక వసతులు కాని, అమ్మకు వందనం పథకం కాని లేవు. పాఠశాలల అభివృద్ధి మాటను పక్కనబెడితే ఉన్న బడులను విలీనం పేరుతో తరలించి, పేదవాడికి ప్రాథమిక విద్య దూరమయ్యేలా చేస్తున్నారు.

### అంతకు ముందు నేలపైనే చదువులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు మా ఊరు బడిలో పిల్లలు నేలపైనే కూర్చొని చదువుకొనే వారు. జగనన్న వచ్చిన తరువాత నాడు-నేడులో భాగంగా బడిని చూడముచ్చగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు బెంచీలు, ఫ్యాన్లు వచ్చాయి. మరుగుదొడ్ల సమస్య తీరింది. బడి చుట్టూ గోడ కట్టడంతో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే అవకాశం లభించింది –కె.కృష్ణ వేణి, విద్యార్థి తల్లి, దెందులూరు

### జగనన్న గోరు ముద్ద విద్యార్థులకు వరం



పాఠశాలల్లో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆహారపు మెనూలో జగనన్న గోరుముద్ద అందరికీ వరంలా మారింది. నాణ్యమైన ఆహారం పూర్తి స్థాయి పర్యవేక్షణతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పటిష్టంగా పెట్టారు. భోజనంతోపాటు పాఠశాలల్లో వైద్య పరీక్షలు వైద్య సేవలు అందించారు. –కట్టా ఏసుబాబు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

### 1000 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు: నాటుసారా తయరీ కేంద్రాలపై సోమవారం కుక్కునూరు పోలీసులు దాడి చేసి 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కుక్కునూరు సీఐ ఎం.రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీధర వేలేరు పంచాయతీ పరిధిలోని వేలేరు గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడుల్లో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారు చేసేవారిపై చట్టపరంగా చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

### పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని నూతన ప్రధానోపాధ్యాయులు కళ్లెం గంగరాజు తెలిపారు. సోమవారం బాలాజీ నగర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా గంగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు గంగరాజును పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. అలాగే శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డాంగే నగర్ అంబేడ్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మంగయ్య, మద్దిపాటి నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను ఈ నెల 3 నుంచి 5 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచన, రుత్విగ్వరణ, పంచగవ్యప్రాసన, దీక్షాధారణ, అంకురార్పణలు నిర్వహించనున్నారు. అలాగే 4న ఉదయం సర్వతో భద్ర మండలి ఆరాధన, మూలమంత్ర అనుష్ఠానం, హోమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల ఆఖరి రోజైన 5న ఉదయం మూల విరాట్‌లకు నవకలశ స్నపన, శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ, హోమాలు, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

### కోడి పందేల స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం: కోడి పందేల స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని మైసన్నగూడెం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు.